www.sphoortipatrika.com APTEL/26/A0542

# స్ఫూర్తి పత్రిక

Voice of Truth

విలేకరులు కావలెను
స్ఫూర్తి పత్రిక డైలీ పేపర్ నందు
కర్నూలు,నంద్యాల,అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్సార్ ,తిరుపతి, అన్నమయ్య ,చిత్తూరు ,జిల్లాలలో పనిచేసేందుకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నియోజకవర్గ ఇన్చార్జీలు మండల రిపోర్టర్స్ కావలెను.
స్ఫూర్తి పత్రిక Voice of Truth
గతంలో పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం వార్తలు చక్కగా రాయగలిగే నైపుణ్యం గల వారికి అవకాశం కలదు.
ఎటువంటి యాడ్స్ టార్గెట్లు లేదు. కొత్త వారికి అవకాశం కలదు.
ఆసక్తి గలవారు సంప్రదించండి : 8179446036,7794947413.

ప్రచురణ : కర్నూలు | సంపాదకుడు : నరసనాయుడు బోయ | సంపుటి : 01 సంచిక :11 | పేజీలు : 04 వెల రూ. 2/- | మంగళవారం 10-03-2026

PUBLICATION : KURNOOL | EDITOR : NARASANAIDU BOYA | VOLUME : 01 ISSUE : 11. | PAGES : 04 PRICE : 2 | TUESDAY, 10 MARCH 2026

Kurnool Edition | Covering Andhra Pradesh & Telangana |

### టీడీపీ ప్రభుత్వంలో 'వైఎస్సార్‌సీపీ

# అంటే ఓట్లు తొలగింపే'

**ఓటర్ల జాబితా సవరణపై అప్రమత్తంగా ఉండాలి**

ఎక్కడా పార్టీ ఓట్లు తొలగించకుండా జాగ్రత్త పడాలి

అవసరమైతే టాస్క్‌ఫోర్స్‌లా ఏర్పడి పని చేయాలి

ఈ ప్రక్రియలో పార్టీ బూత్ కమిటీలది కీలకపాత్ర

2019 ఎన్నికలకు ముందు టీడీపీ ప్రభుత్వం 40 లక్షల ఓట్లు తొలగించింది. మన ఓటర్లను మనమే కాపాడుకోవాలి.



2019 ఎన్నికలకు ముందు టీడీపీ ప్రభుత్వం 40 లక్షల ఓట్లు తొలగించింది. మన ఓటర్లను మనమే కాపాడుకోవాలి. వారి ఓట్లు గల్లంతు కాకుండా మిగతా 2లో

### సింగరేణిలో రేవంత్ సర్కార్ లూటీ గుట్టు రట్టు!



ఎస్సార్పీ ఓసీ-2 టెండరుతో బాగోతం బయటకు: హరీశ్

రేవంత్.. రైతుభరోసా ఇచ్చే ఉద్దేశం లేదా?

సింగరేణి టెండర్లలో దోపిడీకి 'సైట్ విజిట్ సర్టిఫికెట్' ముసుగులో కాంట్రాక్టర్ల రింగ్ ఏర్పాటు చేసి రేవంత్‌రెడ్డి సర్కార్ చేసిన లూటీ ప్రయత్నం గుట్టు రట్టయిందని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.

సింగరేణి టెండర్లలో దోపిడీకి 'సైట్ విజిట్ సర్టిఫికెట్' ముసుగులో కాంట్రాక్టర్ల రింగ్ ఏర్పాటు చేస మిగతా 2లో

### వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో

# చెత్త సమస్య తీవ్ర రూపం దాల్చింది

**జగన్ హయాంలో ఐదేళ్లపాటు చెత్తపాలన సాగించారు..**

వైసీపీ పాలనను చెత్త పాలనగా అభివర్ణించిన నారాయణ

ఇప్పటి వరకు కోటి 15 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేశామన్న మంత్రి

రాష్ట్రాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్య

గత వైసీపీ ప్రభుత్వంపై ఏపీ మంత్రి నారాయణ విమర్శనాస్త్రాలు సంధించారు.



గత వైసీపీ ప్రభుత్వంపై ఏపీ మంత్రి నారాయణ విమర్శనాస్త్రాలు సంధించారు. జగన్ ఐదేళ్ల పాలనను 'చెత్త పాలన'గా అభివర్ణిస్తూ, ఆ సమయంలో పేరుకుపోయిన వ్యర్థాల సమస్య రాష్ట్రానికి పెను సవాలుగా మారిందని ఆయన మండిపడ్డారు. మిగతా 2లో

### 18 ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏఐ ఆధారిత ప్రాజెక్టు ప్రారంభం



- వైద్య సేవలను మరింత వేగవంతం చేసేందుకు ఏఐ టెక్నాలజీ
- 40 అత్యాధునిక పరికరాల ద్వారా వ్యాధి నిర్ధారణ
- సమయం ఆదా కావడమే కాకుండా, కచ్చితత్వంతో కూడిన చికిత్స అందుతుందన్న సత్యకుమార్
- ఆస్పత్రుల్లో ఏఐ సేవలుపైలట్‌గా 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో వినియోగం: మంత్రి సత్యకుమార్

ఆంధ్రప్రదేశ్‌లో వైద్య సేవలను మరింత వేగవంతం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 18 ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏఐ ఆధారిత పైలట్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. మిగతా 2లో

- కొత్త బురుజుకు సీఎం వరాల జల్లు..
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం డోన్ నియోజకవర్గంలోని కొత్తబురుజులో పర్యటించారు.
- రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు.
- సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హార్టికల్చర్ పంటల ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించారు.
- ఈ క్రమంలో మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తన భూమిని ఆక్రమించారని సీఎం చంద్రబాబుకు ఓ రైతు ఫిర్యాదు చేశారు.
- విచారించి సమస్య పరిష్కరించాలని ఆర్డీవోను సీఎం ఆదేశించారు.
- భూ ఆక్రమణ వాస్తవమని తేలితే ఆక్రమణ దారులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.
- ఓ రైతు భూమిని బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి తన అనుచరుల పేరుతో మార్చడం దుర్మార్గమని ధ్వజమెత్తారు.

### రెవెన్యూ సమస్యలు, చట్టాలపై పూర్తిగా

# అవగాహన ఉంది

**రైతు భూమిని కాజేస్తారా..?**

**ఇష్టారాజ్యంగా భూముల తారుమారు..**

**కుటుంబానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి..**

**పరిశ్రమల ద్వారా భారీగా ఉద్యోగాలు..**



జగన్ హయాంలో ల్యాండ్ టైటిల్ యాక్ట్ కింద లక్షల ఎకరాల భూములను అధికారుల ప్రమేయం లేకుండానే ఇష్టారాజ్యంగా తారుమారు చేశారని ఆరోపించారు. ఎన్నికల ముందు పాన్యంలో పాస్ బుక్‌ను చించేసి ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేస్తానని తాను హామీ ఇచ్చానని గుర్తుచేశారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం డోన్ నియోజకవర్గంలోని కొత్తబురుజులో పర్యటించారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హార్టికల్చర్ పంటల ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించారు. ఈ క్రమంలో మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తన భూమిని ఆక్రమించారని సీఎం చంద్రబాబుకు ఓ రైతు ఫిర్యాదు చేశారు. విచారించి సమస్య పరిష్కరించాలని ఆర్డీవోను మిగతా 2లో

### 'చంద్రబాబు విజనరీ కాదు.. పాయిజనరీ'



- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళా ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి విమర్శించారు.
- సూపర్ సిక్స్ పేరుతో మహా దగా చేసిన ఘనత చంద్రబాబుదన్నారు. మహిళలను మోసం చేసి మహిళా దినోత్సవాన్ని ఎలా జరుపుకుంటారని ప్రశ్నించారు.
- చంద్రబాబు విజనరీ కాదు.. పాయిజనరీ అంటూ ధ్వజమెత్తారు.'మూడు జనరేషన్‌లను ఛీట్ చేసిన వ్యక్తి చంద్రబాబు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళా ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి విమర్శించారు. సూపర్ సిక్స్ పేరుతో మహా దగా చేసిన ఘనత చంద్రబాబుదన్నారు. మిగతా 2లో

### ఈ చమురు ధరల పెరుగుదల స్వల్పకాలికమే: ట్రంప్



1983 తర్వాత ఇదే తొలిసారి

నెలల తరబడి ఉండదు

అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై జరిపిన దాడుల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు భగ్గుమంటున్నాయి.

అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై జరిపిన దాడుల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. అయితే ఈ ధరల పెరుగుదల కేవలం మిగతా 2లో

### 72 గంటల కాల్పుల విరమణ ప్రకటించాలి



ఫిబ్రవరి 5 నుంచి నిరంతర కృషి.

ప్రజా శాంతి పార్టీ అధినేత, గ్లోబల్ పీస్ ఇనిషియేటివ్ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ దేశ రాజధాని న్యూఢిల్లీలో కీలక శాంతి సమావేశాన్ని నిర్వహించారు

ప్రజా శాంతి పార్టీ అధినేత, గ్లోబల్ పీస్ ఇనిషియేటివ్ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ దేశ రాజధాని న్యూఢిల్లీలో కీలక శాంతి సమావేశాన్ని నిర్వహించారుఇరాన్ సుప్రీం లీడర్ మిగతా 2లో

### భారత్, చైనాల మైత్రీ కాపాడుకోవాలి

బలమున్న వాడిదే రాజ్యమంటే కుదరదు


ట్రంప్ రాకతో పెరిగిన ఉద్రిక్తతలు

భారత్, చైనాలు సత్సంబంధాలు, మైత్రిని కాపాడుకోవాలని చైనా చైనా అగ్రశ్రేణి దౌత్యవేత్త, విదేశాంగ మంత్రి వాంగ్ యీ తెలిపారు.



భారత్, చైనాలు సత్సంబంధాలు, మైత్రిని కాపాడుకోవాలని చైనా చైనా అగ్రశ్రేణి దౌత్యవేత్త, విదేశాంగ మంత్రి వాంగ్ యీ తెలిపారు.సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, అలాగే ఇరు దేశాల మిగతా 2లో

### మహిళల గురించి జగన్ మాట్లాడడం హాస్యాస్పదం



- వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మరోసారి నిప్పులు చెరిగారు.
- సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది.

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మరోసారి నిప్పులు చెరిగారు. సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలోని మిగతా 2లో

- మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండానే ఇచ్చేసినట్లు డ్రామాలు
- ప్రతి అక్కచెల్లెమ్మకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18,000 ఎప్పుడు ఇస్తారు?
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు 50 ఏళ్లకే పింఛన్ ఎప్పటి నుంచి ఇస్తారు?
- తల్లికి వందనం తొలి ఏడాది పూర్తిగా ఎగవేత.. రెండో ఏడాది అరకొర..
- ఉచిత గ్యాస్ పథకానికి సరిపడా నిధులు ఎందుకు కేటాయించలేదు?
- మహిళలకు ఉచిత బస్సు పథకం 16 కాకుండా 5 సర్వీసులకే ఎందుకు పరిమితం చేశారు?
- డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ కింద ఒక్క రూపాయి అయినా చెల్లించారా?

### చీకటి కాలం..

# దుశ్శాసన పర్వం

**ఈబీసీ నేస్తం.. కాపు నేస్తం ఊసే లేదు**

**వేల కొద్దీ నామినేటెడ్ పదవుల్లో 50 శాతం వాటా**

**మహిళా సంక్షేమ చరిత్రలో మా పాలన సువర్ణ అధ్యాయం**

మూడు రోజులుగా చంద్రబాబు సర్కారు ప్రజలకు మూడు డ్రామాలు చూపించిందని, అసెంబ్లీలో ఒక డ్రామా.. పగటి వేషాలు వేసుకున్న అదే ఎమ్మెల్యేతో మరో డ్రామా



మహిళాభ్యుదయానికి, మహిళా సాధికారతకు చంద్రబాబు పాలన చీకటి కాలమని, ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్నదంతా దుశ్శాసన పర్వమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు,

### ఏపీలో డ్రగ్స్ సంస్కృతి పెరిగిపోవడానికి జగన్ ప్రభుత్వమే కారణం



- జగన్ పై మరోసారి విమర్శలు గుప్పించిన షర్మిల
- జగన్ హయాంలో లిక్కర్ మాఫియా రాజ్యమేలిందని ఆరోపణ
- కంటైనర్ల కొద్దీ మాదకద్రవ్యాలు రాష్ట్రంలోకి వచ్చాయని విమర్శ మిగతా 2లో

## సుంకులమ్మ దేవాలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం

- మర్లమడికి గ్రామ దేవాలయానికి విరాళం
- 15 వేల రూపాయలు అందించిన కురువ శశికళ కృష్ణమోహన్
- గ్రామ శాంతి, ఆధ్యాత్మికత కోసం సహకారం
- దేవాలయ నిర్మాణానికి ప్రజల మద్దతు అవసరం



**హొళగుంద, మార్చి 09 (స్ఫూర్తి పత్రిక):** హొళగుంద మండలంలోని మర్లమడికి గ్రామంలో కొలువైన సుంకులమ్మ దేవి నూతన దేవాలయ నిర్మాణానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కురువ శశికళ కృష్ణమోహన్ ఆర్థిక సహాయంగా 15 వేల రూపాయలు విరాళంగా అందించారు.దేవాలయ నిర్మాణ కార్యక్రమానికి ఆమె సహకారం అందిస్తూ గ్రామ ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామాల్లో శాంతి, ఐక్యత నెలకొల్పడంలో అమ్మవారి ఆలయాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని ఆమె పేర్కొన్నారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే దేవాలయాల నిర్మాణం అభినందనీయమని అన్నారు.గ్రామంలో శాంతి, ఐక్యత మరియు ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆమె సూచించారు. ఈ నేపథ్యంలో సుంకులమ్మ దేవాలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా 15 వేల రూపాయలు అందిస్తున్నట్లు తెలిపారు.గ్రామ ప్రజలు దేవాలయ నిర్మాణ పనులకు సహకరించి త్వరగా పూర్తి చేయాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ కేంద్ర మంత్రి కావూరి సాంబశివరావు కన్నుమూత

- ఐదుసార్లు లోక్‌సభకు ఎన్నికైన అనుభవజ్ఞుడైన నాయకుడు



**అమరావతి, మార్చి 09 (స్ఫూర్తి పత్రిక):** మాజీ కేంద్ర మంత్రి, అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు కావూరి సాంబశివరావు (82) కన్నుమూశారు. ఆయన మరణవార్త రాజకీయ వర్గాల్లో విషాదాన్ని నింపింది. రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. కావూరి సాంబశివరావు లోక్‌సభకు ఐదుసార్లు ఎన్నికై ప్రజాప్రతినిధిగా సేవలందించారు. 1984, 1989, 1998 సంవత్సరాల్లో మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. అనంతరం 2004, 2009 ఎన్నికల్లో ఏలూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు.సుదీర్ఘ రాజకీయ అనుభవంతో ఆయన జాతీయ స్థాయిలో కూడా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 2013లో కేంద్ర ప్రభుత్వంలో జౌళి శాఖ మంత్రిగా పనిచేసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేశారు.రాజకీయ జీవితం పాటు ప్రజాసేవకు ప్రాధాన్యం ఇచ్చిన నాయకుడిగా ఆయన పేరు నిలిచింది. ఆయన మరణంపై పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.కావూరి సాంబశివరావుకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

## బళ్లారి జిల్లా జర్నలిస్టు సంఘం అధ్యక్షుడిగా ఎర్రగుడి రమేష్

- ఆలూరు ఏపీడబ్ల్యూజే నాయకుల హాజరు
- జర్నలిస్టుల ఐక్యతకు పిలుపు







**ఆలూరు , మార్చి 09 (స్ఫూర్తి పత్రిక):** కర్ణాటక రాష్ట్ర జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో బళ్లారి జిల్లా జర్నలిస్టు సంఘం అధ్యక్షుడిగా ఎర్రగుడి రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బళ్లారి జిల్లా కేంద్రంలో నిర్వహించిన పదగ్రహణ కార్యక్రమం ఘనంగా జరిగింది.నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఎర్రగుడి రమేష్‌కు పలువురు జర్నలిస్టులు అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల ఐక్యతతో మీడియా రంగం మరింత బలపడుతుందని ఈ సందర్భంగా పలువురు నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందడంతో ఆలూరు ఏపీడబ్ల్యూజే మండల కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఆలూరు మండల అధ్యక్షుడు వాల్మీకి గోపాల్ నాయుడు, మండల ఉపాధ్యక్షుడు గుత్తి నాగరాజు, తాలూకా ప్రధాన కార్యదర్శి సాక్షి చంద్రబాబు మరియు ఏపీడబ్ల్యూజే ఆలూరు మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బి.ఆర్.కె రంగస్వామి, విశాలాంధ్ర చిన్న, కందనవోలు రామమోహన్, దేశపోరాటం నారాయణస్వామి, ప్రతినిత్యం ఎర్రిస్వామి, విశ్వవార్త వీరేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.జర్నలిస్టులు సమాజంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని, మీడియా బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.

## పేరు మాయని మనిషి

అసలైన సాహిత్యజీవికి వర్తమానం ఎలాంటి కిరీటమూ పెట్టకపోవచ్చు, కానీ చరిత్ర అతడిని తగిన విధంగా ఆశీర్వదిస్తుందనడానికి ఐజాక్ బేబెల్ జీవితమే ఉదాహరణ. అయితే ఆ వర్తమానపు విషాదం చరిత్ర ఎప్పటికీ తుడుచుకోలేని మచ్చ. ఒకప్పటి సోవియట్ యూనియన్‌లో భాగమైన ఉక్రెయిన్‌లో జన్మించిన ఈ యూదు తన మాతృభాష యిడ్డిష్‌ను కాదని రష్యన్‌ను రచనా భాషగా ఎంచుకున్నాడు. సోవియట్ రష్యా ఆకాంక్షలకు అనుగుణంగా నిలిచాడు. పోలిష్--సోవియట్ యుద్ధ సమయంలో రచయిత గోర్కీ సూచన మీద పాత్రికేయుడిగా పనిచేసిన బేబెల్ ఆ యుద్ధం తాలూకు చీకటి, బీభత్సాల చేదు వాస్తవికతను 'రెడ్ కావల్రీ' కథలుగా అందించాడు. 1926లో తొలిసారి ప్రచురితమైన ఈ కథలకు ఇది శతాబ్ది సంవత్సరం.అత్యంత సంక్షిప్తంగా రాయడం, ఉన్నట్టుండి కథను మరో తలంలోకి కొనిపోవడం, 'సాల్ట్' కథ గురించి బోర్హెస్ అన్నట్టు-- కవిత్వానికే సాధ్యమై మననానికి వీలుండే లయను కథలో సాధించడం బేబెల్ గొప్పతనం. రెడ్ కావల్రీ, తను పుట్టి పెరిగిన ఒడెస్సా పట్టణం నేపథ్యంలో 'ఒడెస్సా స్టోరీస్', ఇంకా రెండు నాటకాలు, ఒక సినిమాకు స్క్రీన్‌ప్లే మాత్రమే రాసిన బేబెల్(1894--1940) వచనంలో కరుణ, కాఠిన్యం కలగలసి మనసును మెలిపెడతాయి. యుద్ధభూమి తాలూకు బహుముఖ పార్శ్వాలనూ, అత్యంత సున్నితమైన మనిషి కూడా అనూహ్య కార్యాలకు సిద్ధమయ్యే విపరిణామాలనూ ఆయన చిత్రించాడు. సాధారణ జీవితం గడపాలని కోరుకుంటూ రాజకీయ సుడిగుండంలో చిక్కుకున్న నిస్సహాయ మానవులు అందులో కనబడతారు. చావు వాసన వేసే కథలు ఆయనవి! యుద్ధం అనేది యుద్ధ క్షేత్రానికే పరిమితమై ఉండదని కూడా ఈ కథలు చెబతాయి.కమ్యూనిస్టు వ్యతిరేకి కాకపోయినా బేబెల్ ప్రాపగాండా వ్యతిరేకి. దాంతో విమర్శను తట్టుకోలేని రాజ్యం ఆయన్ని సోవియట్ యూనియన్‌లో 'నాన్--పర్సన్' చేయడానికి పూనుకుంది. 1933 నుంచే ఆయన పుస్తకాలను ఉపసంహరించడం మొదలైంది. స్టాలిన్ హయాంలోని 'సామ్యవాద వాస్తవికత'కు తగ్గట్టుగా రచయితలు తమ పాత రచనలను తిరగరాస్తున్న వేళ, తనను తాను సరిచేసుకోవడం ఇష్టంలేని బేబెల్ మౌనం అనే కొత్త సాహిత్య ప్రక్రియలో రాణిస్తున్నానని చెప్పుకొన్నాడు. ఇక 'ప్రజా శత్రువు'గా అరెస్టయిన తర్వాత బేబెల్ మీద ట్రాట్స్కీయిస్టు, ఉగ్రవాదం, గూఢచర్యం లాంటి కేసులు పెట్టారు. ఆయన పేరును సాహిత్య నిఘంటువుల్లోంచీ, ఎన్‌సైక్లోపీడియాలోంచీ తొలగించారు. ఆయన గురించి ఏ సాహిత్య కార్యక్రమంలోనూ ఎత్తడానికి లేదు. బేబెల్ అనే మనిషి లేనట్టుగానే వ్యవహరించారు. ఆధునిక సోషల్ మీడియా యుగంలో జడలు విప్పిన 'క్యాన్సిల్ కల్చర్' అనేదానికి ఆ కాలంలో బీజాలున్నాయి. 1940 జనవరి 16న పార్టీకీ, సోవియట్ ప్రభుత్వానికీ శత్రువులైన 457 మంది జాబితా స్టాలిన్‌కు అందింది. అందులో బేబెల్ సహా 346 మందిని కాల్చేయాలన్న సిఫారసు ఉంది. జనవరి 27న మధ్యాహ్నం 1:30కు 45 ఏళ్ల బేబెల్‌కు కాల్చివేత శిక్ష అమలైంది. బేబెల్ సమగ్ర రచనలను ఆంగ్లంలోకి అనువదించిన పీటర్ కాన్‌స్టంటీన్ ఈ మరణ శిక్షను 'ఇరవయ్యో శతాబ్ద సాహిత్యపు అతి దారుణ విషాదాల్లో ఒకటి'గా అభివర్ణించారు. 1954లో కృశ్చేవ్ పాలనలో బేబెల్‌ను నిరపరాధిగా ప్రకటించిన తర్వాతగానీ ఆయన రచనలు మళ్లీ వెలుగు చూడలేదు.రష్యా, ఉక్రెయిన్ యుద్ధ నేపథ్యంలో ఉక్రెయిన్ తన గతాన్ని పునఃసమీక్షించుకుంటూ, కొత్త చరిత్రను లిఖించుకుంటున్న వేళ, అక్కడి మేధావర్గంలో బేబెల్ మీద సంక్లిష్ట స్పందన ఉంది. కానీ '(ఉక్రెయిన్) అంధత్వం, అశక్తత, ఆ అశక్తత లోంచి పుట్టిన తెలియని కఠినత్వం' గురించి రాసిన బేబెల్ సృజన విస్మరించలేనిదని పొలిటికల్ సైంటిస్ట్ వాలెంటీన్ బుషాన్‌స్కీ అంటారు.

## సంఘ సేవకు గుర్తింపు... శ్రీనాథ్ గుప్తాకు 'క్రాంతి పురస్కార్'

- హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డు ప్రదానం
- సామాజిక సేవలకు గుర్తింపుగా తెలంగాణ ప్రభుత్వం ఎంపిక
- వైద్య శిబిరాల ద్వారా సేవలందించిన సేవకర్తకు సత్కారం
- మహిళా దినోత్సవం సందర్భంగా ఘనంగా అవార్డు ప్రదానం






**ఆదోని, మార్చి 09 (స్ఫూర్తి పత్రిక):** ఆదోని పట్టణానికి చెందిన సంఘ సేవకర్త వంకదారు శ్రీనాథ్ గుప్తాకు తెలంగాణలోని హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో "క్రాంతి పురస్కార్" అవార్డు ప్రదానం చేశారు. తెలంగాణ ప్రభుత్వం భాషా మరియు సాంస్కృతిక శాఖతో పాటు పలు సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవం మరియు ఉగాది పురస్కారాల కార్యక్రమంలో భాగంగా ఈ అవార్డు అందించారు.పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రానికి చెందిన ప్రముఖులు పాల్గొని శ్రీనాథ్ గుప్తాను శాలువాతో సత్కరించి అవార్డును అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన చూపుతున్న చొరవను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.గత కొన్ని సంవత్సరాలుగా శ్రీనాథ్ గుప్తా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి సేవలందిస్తున్నారు. ముఖ్యంగా ఉచిత కంటి ఆపరేషన్ శిబిరాలు, వాస్కులర్ చికిత్సా శిబిరాలు, డెంటల్ క్యాంపులు, ఆయుర్వేద చికిత్సా శిబిరాలు, ఉచిత ఫెర్టిలిటీ క్యాంపులు వంటి పలు వైద్య శిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలు ప్రముఖ ఎన్నారై కాకుబాల్ నగేష్ సహకారంతో పాటు స్థానిక దాతల సహాయంతో నిర్వహించినట్లు చెప్పారు.అవోపా, వాసవి క్లబ్, ఐఐఎఫ్, ఐవిఎఫ్ వికాస తరంగిణి వంటి సంస్థల సహకారంతో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సేవలను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం తమను క్రాంతి పురస్కార్ అవార్డుకు ఎంపిక చేయడం ఆనందంగా ఉందని శ్రీనాథ్ గుప్తా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రానికి చెందిన పలువురు ప్రముఖులు, సామాజిక సేవకులు మరియు వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. స్థానిక మహిళా నాయకులు మరియు సేవా సంస్థల సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని అవార్డు గ్రహీతకు అభినందనలు తెలిపారు.

## బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి...
## చదువు ద్వారానే మహిళా సాధికారత

- హొళగుందలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు
- బాల్యంలో పెళ్లిళ్లు ఆపాలని అధికారుల పిలుపు
- మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం
- ఆటల పోటీలతో మహిళల్లో ఉత్సాహం




**హొళగుంద, మార్చి 09 (స్ఫూర్తి పత్రిక):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హొళగుంద మండలంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల సాధికారత, బాల్య వివాహాల నిర్మూలన మరియు సమానత్వంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు.కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో విజయలలిత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నప్పటికీ సమాజంలో పూర్తి స్థాయి సమానత్వం సాధించాల్సిన అవసరం ఉందన్నారు. జెండర్ అసమానతలు తగ్గాలంటే కుటుంబ స్థాయిలోనే సమానత్వం గురించి అవగాహన పెరగాలని పేర్కొన్నారు. ఇంట్లో ఆడ, మగ పిల్లలందరికీ సమానంగా విద్యతో పాటు ఇంటి పనులపై అవగాహన ఉండాలని ఆమె సూచించారు.మండల విద్యాశాఖ అధికారి సుధారాణి మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. చిన్న వయసులోనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.ఐసీడీఎస్ సూపర్వైజర్ శిబారాణి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వం పలు చట్టాలను అమలు చేస్తోందన్నారు. వరకట్నం నిషేధ చట్టం, గృహహింస నిరోధక చట్టం, బాల్య వివాహాల నిర్మూలన చట్టం, పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపుల నిరోధక చట్టం, పోక్సో చట్టం వంటి చట్టాల గురించి మహిళలకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో పనిచేస్తున్న వివిధ శాఖల మహిళల కోసం ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ మండల కో-ఆర్డినేటర్ సేవా నాయక్, ఉపాధ్యాయులు, ఐకెపి సిబ్బంది రాధమ్మ, మహిళా సంఘాల సభ్యులు, ఫౌండేషన్ క్లస్టర్ ఆర్గనైజర్ మల్లేశ్వరి, మౌలా సాబ్, విజయ్, శేఖన్నా, భారతి మరియు మండలంలోని మహిళలు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా ST హోదా... ఆంధ్రప్రదేశ్‌లోనే ఎందుకు కాదు?

- గుంతకల్లులో 36 గంటల దీక్షకు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి మద్దతు
- వాల్మీకి సమాజానికి ST హోదా కల్పించాలని డిమాండ్
- రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో మాత్రమే దీజ వర్గీకరణపై ఆవేదన
- సమస్య పరిష్కారం వరకు పోరాటం కొనసాగించాలని పిలుపు






**గుంతకల్లు, మార్చి 09 (స్ఫూర్తి పత్రిక):** వాల్మీకి సమాజాన్ని ఎస్‌టి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ గుంతకల్లు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు నిర్వహించిన 36 గంటల దీక్షకు ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి హాజరై సంఘీభావం తెలిపారు.అనంతపురం జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షుడు బోయ సుంకప్ప ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. వాల్మీకి సమాజానికి ఎస్‌టి హోదా కల్పించాలని కోరుతూ ఈ దీక్ష చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి దేశంలోని అనేక రాష్ట్రాల్లో వాల్మీకి సమాజం ఎస్‌టి జాబితాలో కొనసాగుతున్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాలు మరియు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో మాత్రమే బీసీ వర్గంలో ఉండడం వాల్మీకి సమాజానికి అన్యాయంగా మారిందని అన్నారు.దేశంలోని పలు రాష్ట్రాల్లో వాల్మీకి సమాజానికి ఎస్‌టి హోదా అమల్లో ఉండగా, రాయలసీమ ప్రాంతంతో పాటు కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఈ హోదా లేకపోవడం వల్ల సమాజం అభివృద్ధి అవకాశాల్లో వెనుకబడుతున్నదని తెలిపారు.రాయలసీమ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు కలిసి ఈ సమస్య పరిష్కారం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వాల్మీకి సమాజానికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.వాల్మీకి సమాజ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు తాను కూడా సహకరిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమాజానికి న్యాయం జరిగేలా ప్రజాప్రతినిధులు, సామాజిక నాయకులు కలిసి ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షుడు బోయ సుంకప్ప, గుంతకల్లు మున్సిపల్ చైర్మన్ రాలింగప్ప, జిల్లా కార్యదర్శి చిన్నబాబు, కౌన్సిలర్ కావలి వెంకటేష్, వాల్మీకి సంఘం నాయకులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## సుస్థిర పత్తి సాగుతో రైతులకు అధిక లాభాలు

- రైతులకు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలని సూచనలు
- పురుగు మందుల వినియోగంలో జాగ్రత్తలు అవసరం
- రైతుల ఆదాయ వృద్ధికి పలు కార్యక్రమాలు




**దేవనకొండ, మార్చి 09 (స్ఫూర్తి పత్రిక):** దేవనకొండ మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో సుస్థిర పత్తి సాగుపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడం మరియు పత్తి సాగులో నూతన విధానాలను పరిచయం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ విశ్లేషకుడు మురళి మాట్లాడుతూ ఎంఏఆర్ఐ సంస్థ ఆధ్వర్యంలో సుస్థిర పత్తి సాగుకు సంబంధించిన పద్ధతులపై రైతు సేవా కేంద్రం సిబ్బంది మరియు డీలర్లకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. రైతులకు ప్రయోజనం చేకూరేలా వివిధ శిక్షణా కార్యక్రమాలు, అవగాహన ప్రచారాలు, ప్రదర్శన ప్లాట్లు ఏర్పాటు చేయడం జరుగుతోందని చెప్పారు.పొలాల్లో నీటి నిల్వ కోసం కుంటలను ఏర్పాటు చేయడం, భూసారాన్ని మెరుగుపరచడం మరియు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు సుస్థిర జీవనోపాధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. అలాగే రైతులకు ఉపయోగపడే విధంగా రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను వివరించి రైతులు కొత్త పద్ధతులను అవలంబించాలని సూచించారు.మండల వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ విచక్షణారహితంగా రసాయన ఎరువులు మరియు పురుగు మందులు వాడకుండా సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని తెలిపారు. భూసారాన్ని పెంచే విధంగా వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు.పాత పంట రకాలను వదిలి అధిక దిగుబడిని ఇచ్చే నూతన వంగడాలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ముఖ్యంగా అత్యంత విషపూరితమైన హెచ్‌హెచ్ పీఎస్ మందులు మరియు మిశ్రమ పురుగు మందుల వినియోగాన్ని తగ్గించడం అవసరమని తెలిపారు. అవసరానికి సరిపడే మందులు మాత్రమే వాడేలా రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.అదేవిధంగా రైతులు మందులు పిచికారీ చేసే సమయంలో రక్షణ దుస్తులు ఉపయోగించాలనే విషయంపై కూడా అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ అధికారులు, డీలర్లు మరియు సంస్థల ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే రైతులకు మంచి ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దేవనకొండ వ్యవసాయ అధికారి ఉషారాణి, పత్తికొండ వ్యవసాయ శాఖ సాంకేతిక అధికారి మున్నెమ్మ, వెల్దుర్తి వ్యవసాయ అధికారి అక్బర్ బాషా, ఎంఏఆర్ఐ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళి, దేవనకొండ మరియు ఆస్పరి మండలాల వీఏఏలు, డీలర్లు మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రోజుల లాభాలకు బ్రేక్

## రియాల్టీ, హెల్త్‌కేర్ స్టాక్స్‌కు భారీ నష్టం




దేశీయ ఈక్విటీ మార్కెట్లలో రెండు రోజుల లాభాలకు శుక్రవారం బ్రేక్ పడింది. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ రోజంతా ఒడిదొడుకులను ఎదుర్కొంటూ చివరకు నష్టాలతో ముగిసింది. గ్లోబల్ మార్కెట్లలో మిశ్రమ ధోరణి నేపథ్యంలో రియాల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్, హెల్త్ కేర్ స్టాక్స్ పతనం అయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు కూడా నిధులు ఉపసంహరించడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలహీన పరిచింది. ఫలితంగా బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 329.92 పాయింట్లు (0.43శాతం) నష్టంతో 76,190.46 పాయింట్ల వద్ద ముగిసింది.ఇంట్రాడే ట్రేడింగ్‌లో 428.63 పాయింట్ల పతనంతో 76,091.75 పాయింట్ల కనిష్టానికి పడిపోయింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 113.15 పాయింట్ల పతనంతో 23,092.20 పాయింట్ల వద్ద ముగిసింది. బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా, జొమాటో, టాటా మోటార్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, లార్సెన్ అండ్ టర్బో, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ తదితర స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. మరోవైపు, హిందూస్థాన్ యూనీ లివర్, టెక్ మహీంద్రా, నెస్లే ఇండియా, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంకు తదితర స్టాక్స్ లాభ పడ్డాయి. ఆసియా మార్కెట్లలో సియోల్, షాంఘై, హాంకాంగ్ మార్కెట్‌లు లాభాలతో ముగిస్తే, టోక్యో మార్కెట్ నష్టాలతో స్థిర పడింది. గురువారం విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) రూ.5,462.52 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. గ్లోబల్ ఆయిల్ బెంచ్ మార్క్ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 0.27శాతం పుంజుకుని 78.50 డాలర్లు పలికింది.

## రూపాయి తీరు అధ్వాన్నం.. ఆగ్నేయాసియా దేశాల్లో తీవ్రంగా నష్టపోతున్నది భారత కరెన్సీనే

ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ మూడీస్



డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువే అత్యంత దారుణంగా పడిపోతున్నదని, దక్షిణ/ఆగ్నేయాసియా దేశాల్లో భారత కరెన్సీ తప్ప.. మరే దేశ కరెన్సీ కూడా ఇంత అధ్వాన్న రీతిలో ప్రదర్శన ఇవ్వడం లేదని ప్రముఖ గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ పేర్కొన్నది. గత రెండేండ్లలో దాదాపు 5 శాతం, ఐదేండ్ల (జనవరి 2020 నుంచి)లో ఏకంగా 20 శాతానికిపైగా నష్టపోయిందని గురువారం తెలియజేసింది. ఇకపోతే రేటింగ్ ఉన్న 23 భారతీయ సంస్థల్లో 6 మాత్రమే బలపడుతున్న డాలర్‌తో ప్రభావితమవుతున్నాయని చెప్పింది.

**ఆర్బీఐ జోక్యంతో ఇబ్బందే: రాజన్**

రూపాయి విలువ క్షీణతకు కారణం డాలర్ విలువ పెరుగుతూపోతుండటమేనని, ఇలాంటప్పుడు ఆర్బీఐ జోక్యం.. భారతీయ ఎగుమతుల్ని నష్టపర్చగలదని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. దావోస్‌లో మాట్లాడుతూ.. గృహస్తుల వినియోగ సామర్థ్యం పెరిగేలా, ఉద్యోగావకాశాలు ఏర్పడేలా భారత ప్రభుత్వాలు దృష్టి పెట్టాలన్నారు. ఇదిలాఉంటే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ గురువారం మరో 9 పైసలు పడిపోయింది. 86.44 వద్ద స్థిరపడింది.

## మారుతి కార్ల ధరలకు రెక్కలు

రూ.32,500 వరకు పెంచిన ఆటోమొబైల్ దిగ్గజం




కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి సుజుకీ..నూతన వాహన కొనుగోలుదారులకు షాకిచ్చింది. వచ్చే నెల 1 నుంచి అన్ని రకాల వాహన ధరలను రూ.32,500 వరకు పెంచుతున్నట్లు తాజాగా ప్రకటించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతో సంస్థపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా వాహన ధరలను పెంచాల్సి వచ్చిందని పేర్కొంది. ప్రస్తుతం సంస్థ రూ.3.99 లక్షల ప్రారంభ ధర కలిగిన ఆల్టో కే-10తోపాటు రూ.28.92 లక్షల గరిష్ఠ ధర కలిగిన ఇన్విక్టో మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది.

**సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో వాహన ధరల పెంపు ఇలా..**

కాంప్యాక్ట్ కార్ సెలేరియో రూ.32,500 వరకు పెరగనున్నది.

ప్రీమియం మాడల్ ఇన్విక్టో రూ.30 వేల వరకు అధికంకానున్నది.

మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన వ్యాగన్-ఆర్ మాడల్ రూ.15 వేల వరకు ప్రియంకానున్నది.


స్విఫ్ట్ మాత్రం రూ.5 వేల వరకు పెరగనున్నది.

ఎస్‌యూవీ మాడళ్లు బ్రెజ్జా రూ.20 వేలు, గ్రాండ్ విటారా రూ.25 వేలు ప్రియంకానున్నాయి.

ఎంట్రీ లెవల్ స్మాల్ కారు ఆల్టో కే10 రూ.19,500, ఎస్-ప్రెస్ రూ.5 వేలు పెరగనున్నది.

ప్రీమియం కాంప్యాక్ట్ మాడల్ బాలెనో రూ.9 వేల వరకు అధికమవనుండగా, కాంప్యాక్ట్ ఎస్‌యూవీ ఫాంక్స్ రూ.5,500, కాంప్యాక్ట్ సెడాన్ డిజైర్ రూ.10 వేల వరకు ప్రియంకానున్నాయి.

## రెడ్డీస్ లాభం 1,413 కోట్లు




రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.1,413 కోట్ల నికర కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.1,379 కోట్ల లాభంతో పోలిస్తే కేవలం రెండు శాతం వృద్ధిని కనబరిచింది. అన్ని మార్కెట్లు ఆశించిన స్థాయిలో వృద్ధిని కనబరచడం వల్లనే ఇది సాధ్యమైందని పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.7,215 కోట్లుగా ఉన్న ఆదాయం ఈసారి రూ.8,359 కోట్లకు ఎగబాకింది. ఈ సందర్భంగా కంపెనీ కో-చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ మాట్లాడుతూ..నూతనంగా కొనుగోలు చేసిన ఎన్ఆర్‌టీ బిజినెస్ రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్నదనని, నూతన ఔషధాలు విడుదల చేయడం, నిర్వహణ పనితీరు మెరుగుపడటం కూడా కలిసొచ్చిందన్నారు. గత త్రైమాసికంలో అమెరికా నుంచి రూ.3,383 కోట్ల ఆదాయం సమకూరినట్లు వెల్లడించింది. అలాగే భారత్‌లో విక్రయాలు రూ.1,180 కోట్ల నుంచి రూ.1,346 కోట్లకు పెరగగా, వృద్ధిపరంగా చూస్తే 14 శాతం అధికమైందన్నారు. యూరప్ నుంచి రూ.1,210 కోట్లు, అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి రూ.1,436 కోట్ల ఆదాయం సమకూరింది. మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు స్వల్పంగా తగ్గి రూ.1,289.35 వద్ద ముగిసింది.

- అధికారుల నిఘా ఎంతవరకు పనిచేస్తోంది?
- కర్నూలు జిల్లాలో బాల్య వివాహాలపై పెరుగుతున్న చర్చ
- పెళ్లి సీజన్‌లో అధికారులు నిఘా పెంచాలంటున్న ప్రజలు
- అవగాహన కార్యక్రమాలు మాత్రమే సరిపోతాయా అన్న ప్రశ్న
- బాలికల భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తున్న సామాజిక వర్గాలు

బాల్యంలో పసుపు తాడు...

# భవిష్యత్తుకు ఉరితాడు?

**కర్నూలు జిల్లా, మార్చి 09 (స్ఫూర్తి పత్రిక):** బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం పలు చట్టాలు అమలు చేస్తున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో అవి పూర్తిగా ఆగిపోయాయా అనే ప్రశ్న మళ్లీ ముందుకు వస్తోంది. ముఖ్యంగా పెళ్లి సీజన్ ప్రారంభమైన సమయంలో కొన్ని ప్రాంతాల్లో చిన్న వయసులోనే బాలికలకు వివాహాలు జరుపుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చట్టాల ప్రకారం బాలికలకు 18 సంవత్సరాలు పూర్తికాకుండా వివాహం జరిపించడం నేరంగా పరిగణించబడుతుంది. అయినప్పటికీ సామాజిక పరిస్థితులు, ఆర్థిక సమస్యలు, సంప్రదాయ ఆచారాలు మరియు అవగాహన లోపం వంటి కారణాల వల్ల కొన్నిచోట్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


### చదువు మధ్యలోనే పెళ్లి

బాలికలు చదువుతున్న సమయంలోనే వివాహం జరగడం వల్ల వారి విద్యాభ్యాసం మధ్యలోనే ఆగిపోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని విద్యావేత్తలు చెబుతున్నారు. చిన్న వయసులోనే పెళ్లి జరిగితే బాలికలు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.విద్య ద్వారా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడతారని, చదువు కొనసాగితే కుటుంబం మరియు సమాజం అభివృద్ధి చెందుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

### ఆరోగ్యంపై ప్రభావం

చిన్న వయసులోనే వివాహం జరగడం వల్ల బాలికల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. తక్కువ వయసులో గర్భధారణ జరగడం వల్ల తల్లి మరియు శిశువు ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని వారు సూచిస్తున్నారు.అందుకే బాలికల ఆరోగ్యాన్ని కాపాడేందుకు మరియు వారి భవిష్యత్తు సురక్షితంగా ఉండేందుకు బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు.




### చట్టాలు ఉన్నా అమలు ఎంతవరకు?

ప్రభుత్వం బాల్య వివాహాల నిర్మూలన కోసం పలు చట్టాలు అమలు చేస్తోంది. మహిళా సంక్షేమ శాఖ, ఐసీడీఎస్, విద్యాశాఖ, పోలీస్ శాఖలు కలిసి గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఈ చట్టాల అమలు పూర్తిగా ఫలితాలు ఇవ్వలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్రామాల్లో అవగాహన లోపం కారణంగా కొంతమంది తల్లిదండ్రులు చిన్న వయసులోనే కుమార్తెలకు వివాహాలు జరిపిస్తున్నారని సామాజిక కార్యకర్తలు చెబుతున్నారు.

### సమాజం మారితేనే మార్పు

బాల్య వివాహాలను అరికట్టాలంటే కేవలం చట్టాలు సరిపోవని, సమాజంలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు అధికారులు కలిసి పనిచేస్తేనే ఈ సమస్యకు పూర్తిగా పరిష్కారం దొరుకుతుందని వారు సూచిస్తున్నారు.బాలికల చదువు, ఆరోగ్యం మరియు భవిష్యత్తు కోసం సమాజం మొత్తం చైతన్యంతో ముందుకు రావాల్సిన అవసరం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.బాల్యంలో కట్టే పసుపు తాడు ఒక కుటుంబానికి ఆనందం కలిగించినా, ఆ బాలిక భవిష్యత్తుకు మాత్రం భారంగా మారే ప్రమాదం ఉందని సామాజిక వేత్తలు హెచ్చరిస్తున్నారు.

### అవగాహనే మార్గం

బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయాల ద్వారా బాలికల విద్యపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.బాలికల భవిష్యత్తు కోసం సమాజం మొత్తం ముందుకు వచ్చి బాల్య వివాహాలకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉందని సామాజిక వేత్తలు పేర్కొంటున్నారు.

## జీవిత కాల గరిష్టానికి బంగారం

## ధర 11 నెలల్లోనే 32 శాతం పుత్తడి ధర పెరుగుదల

అంతర్జాతీయ సానుకూల పరిస్థితుల నేపథ్యంలో దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు ధగధగమని మెరుస్తున్నాయి. గురువారం 99.9శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ. 17 వృద్ధితో రూ.82,900లకు చేరుకుని తాజాగా మరో జీవిత కాల గరిష్టాన్ని తాకింది. బుధవారం తులం బంగారం ధర రూ. 82,730 వద్ద ముగిసింది. గతేడాది ఫిబ్రవరి 23న రూ.62,720 పలికిన పది గ్రాముల బంగారం ధర గురువారం (2025 జనవరి 23) రూ.82,900 పలికింది. అంటే 11 నెలల్లోనే బంగారం బంగారం తులం ధర రూ. 20,180 (32.17 శాతం) పెరిగింది. వరుసగా ఏడో సెషన్‌లోనూ 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.170 పెరిగి రూ.82,500లతో తాజా జీవిత కాల గరిష్టాన్ని తాకింది. బుధవారం ఇదే బంగారం తులం ధర రూ.82,330 స్థిర పడింది. గత ఏడు సెషన్లలో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.2,320 చొప్పున వృద్ధి చెందింది. ఇదిలా ఉంటే గురువారం కిలో వెండి ధర రూ.500 తగ్గి రూ.93,500 పలికింది. బుధవారం కిలో వెండి ధర రూ.94,000 వద్ద స్థిర పడింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ గిరాకీ గల బంగారానికి దేశీయ బులియన్ మార్కెట్లో రిటైలర్లు, జ్యువెల్లర్ల నుంచి



డిమాండ్ పుంజుకోవడంతో బంగారం ధరలు పెరుగుతున్నాయని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో గురువారం గోల్డ్ కాంట్రాక్ట్స్ ఫిబ్రవరి డెలివరీ తులం బంగారం ధర రూ.19 (0.02 శాతం) పెరిగి రూ.79,583లకు చేరుకుంది. మరోవైపు కిలో వెండి ఫ్యూచర్స్ ధర రూ.422 (0.46 శాతం) తగ్గి రూ.91,522 లకు చేరుకుంది. బుధవారం కిలో వెండి ధర రూ.91,944 వద్ద స్థిర పడింది. అంతర్జాతీయ మార్కెట్లలో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ బంగారం ధర 13.20 డాలర్లు (0.48 శాతం) తగ్గి 2,757.70 డాలర్లకు చేరుకుంది. యూఎస్ డాలర్, యూఎస్ ట్రెజరీ బాండ్ల ధరల్లో రికవరీతో బంగారం ధరలు ఫ్లాట్ నుంచి నెగెటివ్‌గా మారాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమొడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ చెప్పారు. బుధవారం యూఎస్ డాలర్ ఇండెక్స్, ట్రెజరీ బాండ్లు పాజిటివ్‌గా ముగిశాయి. దీనివల్ల గురువారం బంగారం ధర పెరిగిందని సౌమిల్ గాంధీ తెలిపారు. వచ్చే ఒకటి, రెండు రోజుల్లో బంగారం రికార్డు గరిష్టాలకు చేరుతుందని అగుమెంట్ రీసెర్చ్ హెడ్ రెనిషా చైనానీ చెప్పారు. వివిధ దేశాల నుంచి దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కూడా బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు పుంజుకోవడానికి కారణమయ్యాయి. సిల్వర్ కామెక్స్‌లో ఔన్స్ వెండి ధర 1.03 శాతం పతనంతో 31.10 డాలర్లు పలికింది. కెనడా, మెక్సికోలపై 25 శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించారని రెనిషా చైనానీ తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించే విధానాలతో ద్రవ్యోల్బణం పెరిగిపోయే అవకాశం ఉందని, యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లు తగ్గించకపోవచ్చునని చెప్పారు. ప్రపంచంలోనే కెనడాలోనే ఎక్కువగా వెండి తయారవుతుంది.

## తక్కువ పెట్టుబడితో.. రోజుకు రూ.10 వేలు లాభం



ప్రభుత్వ ఉద్యోగాలా లేవు. ప్రైవేట్ ఉద్యోగాలు ఉన్నా.. వాటికి ఎక్కడ చూసినా.. విపరీతమైన పోటీ ఉంది.. ఉంటోంది. దీంతో సొంతంగా ఏదైనా వ్యాపారం ప్రారంభించుకొందామా? అంటే.. వాటిని ప్రారంభిస్తే.. నష్టాలు వస్తాయేమో అనే మీమాంసం... పలువురిని టెన్షన్ పెడుతోంది. అలాంటి వేళ.. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించే వ్యాపారాలు కొన్ని ఉన్నాయి. అంతేకాదు.. ఓ వేళ మీరు వ్యాపారం ప్రారంభిస్తే.. ప్రభుత్వం సైతం మీకు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వస్తుంది. అదే గొర్రెల పెంపకం వ్యాపారం. ప్రస్తుత వేళ.. ఈ వ్యాపారం గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం తర్వాత రెండవ స్థానంలో ఉంది. అంతేకాదు.. అతి పెద్ద వ్యాపారంగా కూడా ఎదిగింది. దీనిలో ఓ ప్రత్యేకత సంతరించుకొంది. ఇందులో నష్టం చాలా తక్కువగా ఉంటుంది. గొర్రెల మాంసం, పాలకు మార్కెట్లో విపరీతమైన డిమాండ్ ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. అందువల్ల ఈ వ్యాపారంలోని లాభాలు అధికంగా ఉంటాయి. నష్టాలు చాలా స్వల్పంగా ఉంటాయని ఈ వ్యాపారం చేసిన వారు చెబుతారు. గొర్రెల మాంసంలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. అలాగే గొర్రె పాలలో అధిక ఔషధ గుణాలు ఉంటాయి.ఇక గొర్రెల కాళ్ల నుంచి ఎన్నో రకాల ఉత్పత్తులు తయారవుతాయి. దీంతో గొర్రెల వ్యాపారంతో భారీగా నగదు సంపాదించవచ్చు. కానీ ఈ గొర్రెల వ్యాపారం ప్రారంభించాలంటే.. సరైన అవగాహన ఉండాలి. లేకుంటే నష్టాల పాలయ్యే అవకాశాలే ఎక్కువ. గొర్రెల పెంపకంలో కొన్ని మెళకువలు: వీటి పెంపకంలో కొన్ని మెళకువలు పాటించాల్సి ఉంటుంది. వాటిని జాగ్రత్తగా పాటిస్తే.. మంచి ఆదాయం సమకూరుకోవచ్చు. ఓ వేళ గొర్రెలను పెంచుతోంటే.. వాటిని తరచు శుభ్రం చేయాలి. వాటికి ఫెనైల్ లేదా డిజిన్ఫెక్టెంట్ స్ప్రే చేయడం ద్వారా గొర్రెలను సంక్రమణాల నుంచి రక్షించవచ్చు. శుభ్రతే.. గొర్రెలకు వ్యాధుల నుంచి కాపాడుతోంది. ఇక గొర్రెలను చలికాలంలో చాలా ప్రత్యేకంగా చూసుకోవాల్సి ఉంది. చల్లని వాతావరణంలో గొర్రెలను వేడిగా ఉంచేందుకు... నేలపై పసుపు చల్లి.. నీటి నుంచి వచ్చే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి గోడలకు రంగ వేయాల్సి ఉంటుంది. దీని ద్వారా హానికరమన సూక్ష్మజీవాలను తొలగించవచ్చు. దీని ద్వారా గొర్రెలకు వేగంగా వ్యాధులు సంక్రమించవు. ఇక గొర్రెల వయస్సు, బరువు ప్రకారం.. పోషకాహారాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. చలికాలంలో వాటికి రోగనిరోధక శక్తిని పెంచేందుకు బలవర్ధకమైన ఆహారం అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం మటన్‌కు భారీగా డిమాండ్ ఉంది. అటువంటి పరిస్థితుల్లో.. ఈ వ్యాపారాన్ని చేపట్టేందుకు అత్యధికులు ఆసక్తి కనబరుస్తున్నారు. గొర్రెల పెంపకంలో మంచి సంరక్షణ, సరైన పోషకాహారం ఇవ్వడం ద్వారా ఇది రైతుల కోసం ఒక స్థిర ఆదాయ వనరుగా మారుతోంది. నిపుణుల సూచనలను పాటించడం ద్వారా గొర్రెల పెంపకం మరింత లాభసాటిగా మారుతోంది. ఈ వ్యాపారం వల్ల స్వల్ప వ్యవధిలో.. అధిక మొత్తంలో నగదు సంపాదించే అవకాశం ఉంది. అదీకాక ఈ గొర్రెల వ్యాపారం ప్రారంభించాలను కొంటే.. బ్యాంకులకు కానీ.. పశు సంవర్ధక శాఖ అధికారులను కానీ సంప్రదిస్తే.. అందుకు సంబంధించిన వివరాలను వారు వివరిస్తారు.

జియో నూతన

## ప్రీపెయిడ్ ప్లాన్లు

టెలికం దిగ్గజం రిలయన్స్ జియో ప్రీపెయిడ్ యూజర్లకోసం కొత్తగా వాయిస్, ఎస్ఎంఎస్ ప్లాన్లను ప్రవేశపెట్టింది. టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ సూచనల మేరకు డాటా అవసరంలేని కస్టమర్లకోసం తప్పనిసరిగా వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌లతో కూడిన ప్లాన్లను ప్రవేశపెట్టాలనే సూచనలకు అనుగుణంగా జియో ఈ నూతన ప్లాన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 84 రోజుల కాలపరిమితితో రూ.458 ప్లాన్ ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ప్లాన్‌కింద అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, వెయ్యి ఎస్ఎంఎస్‌లు, రూ. 1,958 ప్లాన్ కింద అన్‌లిమిటెడ్ వాయిస్‌కాల్స్‌తోపాటు 3,600 ఎస్ఎంఎస్‌లు 365 రోజుల ప్యాక్‌ను అందిస్తున్నది.




SPHOORTI PATRIKA (Telugu Daily) | PRGI Reg. No. APTEL/26/A0542 | Publisher, Printer & Editor: NarasaNaidu Boya | Printed at: Rajeswari Printers, Kurnool | Place of Publication: Kurnool, Andhra Pradesh | Cell: 8179446036, 7794947413 | Email: sphoortipatrika@gmail.com | Website: www.sphoortipatrika.com